క్లుప్తంగా

నగరంపాలెం ఎస్‌హెచ్‌వోగా నరేష్



గుంటూరు ఈస్ట్: నగరం పాలెం పోలీసు స్టేషన్ ఎస్ హెచ్‌వోగా దార్నాసి నరేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1998లో ఎస్ఐగా విధుల్లో చేరారు. 2006లో సీఐగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం గుంటూరు దిశ పోలీసు స్టేషన్ నుంచి బదిలీపై నగరంపాలెం పోలీసు స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వోగా వచ్చారు.

అలరించిన సినీ సంగీత విభావరి



పాత గుంటూరు: ఏకే కల్చరల్ అసోసియేషన్ పదో వార్షికోత్సవం సందర్భంగా రాజా గారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. పలు చిత్రాల్లోని పాటల్ని గాయకులు రమణి, హేమ మాలిని, రసూల్ బాబు, జరీనా, లలిత్ బాబు, గాయత్రి ఆలపించారు. అశోక్ బృందం సంగీతాన్ని అందించింది. అనంతరం జరిగిన సభకు సంస్థ నిర్వాహకులు అమానుల్లా ఖాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి



గుంటూరు రూరల్: ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మేడికొండూరు మండలం పేరేచర్లకు చెందిన ఇరగదల బ్రహ్మం(35) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఆటోనగర్ వైపు నుంచి బుధవారం సాయంత్రం చిల్లీస్ మీదుగా పేరేచర్లకు ట్రాక్టర్‌తో బయలుదేరాడు. ప్రమాదవశాత్తూ అదుపు తప్పి ఇన్నర్ రింగ్‌రోడ్డులో బోల్తా పడింది. ప్రమాదంలో బ్రహ్మం తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐర్లాండ్‌లో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు



గుంటూరు రూరల్: ఫార్మసీ విద్యకు ఐర్లాండ్ దేశంలో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఐర్లాండ్ లియోగ్లోబల్ ఓవర్సీస్ అంతర్జాతీయ పరిపాలన సలహాదారుడు డేవిడ్ పాలన్ తెలిపారు.నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ఐర్లాండ్ దేశంలో విద్య ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్ పాలన్ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక వేతనం తీసుకుంటున్న వారిలో రెండు శాతం విద్యార్థులు ఐర్లాండ్ నుంచి వెళ్ళిన వారేనని తెలిపారు. భారతదేశంనుంచి ఐర్లాండ్‌లో సుమారు 80 వేల మంది వివిధ రంగాల్లో స్థిరపడి ఉన్నారని చెప్పారు. ఫైజర్, ఆపిల్, ఇంటెల్, ఫార్మాస్యూటికల్ ప్రొడక్ట్స్, సాఫ్ట్‌వేర్, మెడ్‌టెక్ తదితరాలను ఎగుమతి చేసే దేశాల్లో ఐర్లాండ్ ఒకటని తెలిపారు. ఉన్నత విద్య, ఉద్యోగాలకు అవసరమైన సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి, గుంటూరు శాఖ మేనేజర్ అమూల్యను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు, చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు ఘనంగా సన్మానించారు.

ఆర్థిక సమస్యలతో యువకుడి ఆత్మహత్య

చేబ్రోలు: ఆర్థిక సమస్యల కారణంగా యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు దళితవాడలో బుధవారం జరిగింది. నారాకోడూరు గ్రామానికి చెందిన కోడూరి కోటేశ్వరరావు (31) ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు గమనించి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోటేశ్వరరావు బుధవారం మరణించాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తులపై కేసులు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్య క్తులపై కేసులు నమోదయ్యాయి. గంగానమ్మ పేటలో కొత్తపేటకు చెందిన వ్యక్తి ఆరు సీసాలు తీసుకెళుతుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు.మార్కెట్ ఏరియాలో వన్ టౌన్ పోలీసులు ఓ వ్యకి వద్ద 20, మరో వ్యక్తి వద్ద 10 సీసాలను స్వాధీనపర్చుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

జగనన్నది జనరంజక పాలన

- 99 శాతం హామీల అమలు
- సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



ఎమ్మెల్సీ చంద్రగిరితో కలిసి డివిజన్‌లో పర్యటిస్తున్న మంత్రి రజిని

నెహ్రూనగర్: జనరంజక పాలనతో జగనన్న సంక్షేమ ఫలాల్ని ప్రజల చెంతకు చేర్చారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. నగరంలోని 22వ వార్డు, శ్రీనివాసరావుపేట, ఐటీసీ సమీపంలోని వంగవీటి మోహనరంగా విగ్రహం వద్ద నుంచి బుధవారం సాయంత్రం 'మనతో మన రజినమ్మ' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి పని చేసిన తొలి ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఈ దేశంలోనే రికార్డు సృష్టించారని తెలిపారు. సంక్షేమానికి పెద్దపీట వేసిన ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ఏకంగా రూ.5 లక్షల కోట్ల లబ్ధి ప్రజలకు చేకూర్చిన మనసున్న సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కోవిడ్ సమయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తమ ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుందని వివరించారు. ఎంత ఖర్చయినా వెనుకాడకుండా ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించిన ఏకైక రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మాత్రమేనని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం లాంటి కీలక రంగాలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తూ, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గొప్ప గొప్ప సంస్కరణలు తీసుకొచ్చి అమలు చేసిన గొప్ప ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అంతా అండగా ఉండాలకోరారు. మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు మాట్లాడుతూ జగనన్నతోనే బడుగులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గేదెల నాగరంగమణి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, క్లస్టర్, మండల ఇన్‌చార్జిలు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

కమిటీ నిర్ణయం మేరకే టీడీఆర్ బాండ్లు మంజూరు

కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ప్రభుత్వ నిర్దేశిత మార్గదర్శకాలు, ఏర్పాటు చేసిన కమిటీ నిర్ణయాల ప్రకారం టీడీఆర్ బాండ్ల మంజూరు చేయడానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి పట్టణ ప్రణాళిక అధికారుల్ని ఆదేశించారు. ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్(టీడీఆర్) బాండ్ల జారీ పరిశీలన కమిటీ మెంబర్స్‌తో బుధవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టీడీఆర్ బాండ్ల పంపిణీ పారదర్శకంగా జరిగేలా నగరపాలక సంస్థ, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. అది నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు బాండ్లు పంపిణీకి పట్టణ ప్రణాళిక విభాగం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలో పెద్ద పలకలూరు రోడ్డు, కుగ్లర్ హాస్పిటల్ రోడ్డు, ఏటీ అగ్రహారం రోడ్డు, తారకరామానగర్, మొండి గేటు, నందివెలుగు రోడ్డు తదితర ప్రాంతాల్లో విస్తరణ, పైప్ లైన్ పనులు జరిగిన చోట టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉందన్నారు. త్వరలో కమిటీ నిర్ణయం మేరకు జారీ చేస్తామని కమిషనర్ వెల్లడించారు. సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీప్లానర్ మహాపాత్రో, ఏసీపీ అజయ్ కుమార్, మురళి, ఎమ్మార్వోలు, సబ్ రిజిస్ట్రార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా?

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ సుందర్రామిరెడ్డి

నెహ్రూనగర్: పొన్నూరు రోడ్డులో పైపులైన్ మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. ఇంజినీరింగ్ అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. బీఆర్ స్టేడియం రిజర్వాయర్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్‌పై(పొన్నూరు రోడ్డులో) లీకులు ఏర్పడంతో వాటికి ఇంజినీరింగ్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. బుధవారం పంపింగ్ అనంతరం పనులు ప్రారంభించిన అధికారులు గురువారం సాయంత్రానికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. 600 ఎంఎం ఆర్‌సీసీ పైపు కొంత భాగం పూర్తిగా దెబ్బతినడంతో దాన్ని తొలగించి ఎంఎస్ పైపులైన్ రూ.6లక్షల వ్యయంతో వేస్తున్నట్లు ఏఈ సునీల్‌కుమార్ చెప్పారు. పనుల్ని బుధవారం ఎస్ఈ (ఎఫ్ఏసీ) సుందర్రామిరెడ్డి పరిశీలించారు. పొన్నూరు రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా గురువారం సాయంత్రానికి పనులను పూర్తి చేసి, శుక్రవారం ఉదయం నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు.

వీధి బాలల ఆశ్రమానికి రూ. లక్ష విరాళం



ఆశ్రమ నిర్వాహకురాలు ప్రతీషకు చెక్కు అందజేస్తున్న ప్రతీష

గుంటూరు ఎడ్యుకేషన్: బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రనగర్‌లోని మాతృశ్రీ వీధి బాలల ఆశ్రమానికి రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని ట్రస్టీ పి. ప్రతీష అందజేశారు. ఆశ్రమంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సంబంధిత మొత్తాన్ని ఆశ్రమ నిర్వాహకురాలు నడింపల్లి జానకీ శైలజ విజయప్రసాద్‌కు చెక్కు రూపంలో ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రతీష మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా నిరాదరణకు గురైన వీధి బాలల్ని చేరదీసి వారికి భోజన, వసతి సదుపాయాలతో పాటు చదువుకునే అవకాశాలు కల్పించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు జీవన్‌కాంత్, మురళీధర్ పాల్గొన్నారు.

హాస్యం దివ్య ఔషధం



సమావేశంలో మాట్లాడుతున్న నాటక రచయిత కావూరి సత్యనారాయణ

లక్ష్మీపురం: శారీరకంగా, మానసికంగా హాస్యం దివ్య ఔషధమని, అదిలేని బతుకు నరకమని ప్రముఖ నాటక రచయిత దర్శకుడు కావూరి సత్యన్నారాయణ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం హాస్యవల్లరి-నవ్వు-నవ్వించు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హాస్యం పది మందిని ఒక చోటకు చేరుస్తుందన్నారు. ఏకాంత భావన, భయాలను తరిమి గొట్టగలిగేది నవ్వు మాత్రమేనని తెలిపారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, హాస్య వల్లరి కో-ఆర్డినేటర్ వి.వి.రావ్ మాట్లాడుతూ అవగాహన సంస్థ కాలేజీలు, స్కూళ్లలోనూ నవ్వు-నవ్వించు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం సంస్థ సభ్యులు పలు హాస్య నాటికలను ప్రదర్శించారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



ద్విచక్ర వాహనదారులను పరిశీలిస్తున్న ఆర్టీవో అధికారులు

నెహ్రూనగర్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం కాజా టోల్ ప్లాజా వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించని 110 మంది ద్విచక్ర వాహనదారులపై, రిఫ్లెక్టివ్ టేపులు లేని 15 వాహనాలపై కేసులు నమోదు చేశామని తెలిపారు. వాహనదారులంతా తప్పనిసరిగా రహదారి భద్రతతో పాటు నియమ, నిబంధనలు పాటించాలని సూచించారు. తనిఖీల్లో ఆర్టీవో అధికారులు గోపాల్, సౌజన్య, రాఘవరావు, విజయసారథి పాల్గొన్నారు.

ఆస్తి కోసం మనవడి వేధింపులు

తెనాలిరూరల్: ఆస్తి రాసివ్వాలని అమ్మమ్మను మనవడు, అతనితో వివాహేతర సంబంధం ఉన్న మహిళ, ఆమె తరపువారు వేధింపులకు గురి చేస్తుండడంపై కేసులు నమోదయ్యాయి. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ గంగానమ్మపేటకు చెందిన సుబ్బలక్ష్మిని ఆమె మనవడు విజయభాస్కర్, అతనితో వివాహేతర సంబంధం ఉన్న మహిళ, ఆమె తరపు మరో ఐదుగురు ఆస్తి తమకు రాసివ్వాలని వేధింపులకు గురి చేస్తున్నారు. మద్యం తాగి వచ్చి మనవడు తరచూ వేధింపులకు గురి చేస్తుండడంతో సుబ్బలక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూ టౌన్ పోలీసులు బుధవారం తెలిపారు.

రేపు టీజేపీఎస్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికను ఈనెల 26న ఉదయం 10:30 గంటలకు కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పోలిశెట్టి జ్ఞానదేవ్, చక్కా అధిపతిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థులంతా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్య అతిథిగా పూర్వ విద్యార్థి వడ్లమాని రవి పాల్గొనున్నారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 92464 88133, 92464 89003 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్‌బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కాకుమాను: రైతు భరోసా కేంద్రాల్లో అందిస్తున్న సదుపాయాలు, పథకాల్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రం-2లో బుధవారం వ్యవసాయ సలహా మండల సమా వేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివరామకృష్ణ మాట్లాడుతూ గ్రామస్థాయిలోనే రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను సకాలంలో అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి గ్రామంలో ఎన్నో కోట్లు ఖర్చు చేసి రైతు భరోసా కేంద్రాల్ని నిర్మించారని తెలిపారు. పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంట వివరాలను రైతులు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి కిసాన్ సన్మాన్ నిధికి అర్హులైన రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆమె తెలిపారు.వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు కొత్త అమేష్, ఏవో కె.కిరణ్మయి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ మహిళా మేట్లుకు శిక్షణ

ప్రత్తిపాడు: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న మహిళా మేట్లుకు గురువారం గొట్టిపాడు పంచాయతీ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఏపీవో షేక్ మస్తాన్‌వలి తెలిపారు. గొట్టిపాడు, గనికపూడి పంచాయతీల్లో పనిచేస్తున్న మేట్లు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు. ఉపాధి హామీ పథకంలో మార్పులు, పనుల గుర్తింపు, కొలతలు తీసే విధానంతో పాటు మస్టర్లు వేసే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు మస్తాన్‌వలి చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: ఆర్.అగ్రహారం కోనేరులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సంపత్‌నగర్‌కు చెందిన వెంకటశివరామకృష్ణ (36) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం ఆర్.అగ్రహారం కోనేరులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడు అదృశ్యం



కార్తిక్

బాలుడు కనిపించకుండా పోయిన ఘటన కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. 11 సంవత్సరాల శ్రీసాయి లక్ష్మణ్ కార్తిక్ ఈనెల 12 ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడు చెవిటి, మూగ సమస్యతో బాధపడుతున్నాడు. ఫొటోలోని బాలుడిని గుర్తించిన వారు 8688831320కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

వీవీఐటీలో భవిష్యత్ భవన నిర్మాణంపై సదస్సు



సుధీర్‌నాథ్ బుద్దీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ)కళాశాలలోని సివిల్ ఇంజినీరింగ్‌కు చెందిన నిర్మాణద్రష్ట విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో భవిష్యత్ భవన నిర్మాణం, రూపకల్పన బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా ఆస్ట్రేలియాకు చెందిన ఏసీఈబీఐఎం సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ డాక్టర్ సుధీర్‌నాథ్ బుద్దీ హాజరయ్యారు. భవన నిర్మాణ సమయంలో వ్యర్థాలను తగ్గించి నాణ్యత, సామర్థ్యాల పెరుగుదలకు బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ (బీమ్) సాంకేతికత దోహదపడుతుందని వివరించారు.దీని ద్వారా నిర్మాణ సమయంలో కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గించవచ్చని, డిజైన్ దశలో విద్యుత్, నీటి వినియోగం తగ్గుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎన్. కుమారస్వామి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె. గిరిబాబు, సివిల్ విభాగాధిపతి డాక్టర్ టి. శ్రీధర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను ఎదగనివ్వాలి



జలగం రామారావు హైస్కూల్లో మహిళా కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆడపిల్లల్ని ఇంట్లో నుంచే తక్కువ చేయడం జరుగుతోందని, వారికి అందరితో సమానంగా ఎదిగే అవకాశమివ్వాలని ప్రభుత్వ మహిళా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.ఎం.ఎస్. శైలజ పేర్కొన్నారు. సాంబశివపేటలోని మహిళా కళాశాలలో స్త్రీ సాధికారత విభాగ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ ఆడపిల్లలు అన్ని అవకాశాలను అందిపుచ్చుకుని ఎదిగే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. స్త్రీ సాధికారత కన్వీనర్ విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రులకు మనపై నమ్మకముండే విధంగా ప్రవర్తన ఉండాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం కొత్తపేటలోని జలగం రామారావు, గొలుసు కొండలరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలకు అధ్యాపకులు, విద్యార్థినులు వెళ్లారు. ఆహారపు అలవాట్లు, విద్యావకాశాలు, సామాజిక మాధ్యమాలతో వచ్చే సమస్యలు, వాటి పరిష్కారాలను విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగాధిపతి వి. కోటేశ్వరరావు, అధ్యాపకులు డాక్టర్ జి. మల్లికార్జున, డాక్టర్ ఏ. అజయ్‌కుమార్, డాక్టర్ ఆర్. ప్రసన్న జాస్మిన్, ఎస్ఎస్ఎస్ సమన్వయకర్తలు సుబ్బరత్నమ్మ, డాక్టర్ డి.ధాత్రీకుమారి పాల్గొన్నారు.

బీజేపీ విజయ సంకల్ప యాత్ర



పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న జయప్రకాష్‌నారాయణ, పక్కన పలువురు నేతలు

గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్ర బుధవారం స్థానిక గుజ్జనగుండ్ల ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద ప్రారంభమై, మారుతీ నగర్, నాయీ బ్రాహ్మణ కాలనీ, భాగ్యనగర్ కాలనీ, ఎల్ఐసీ కాలనీ మీదుగా స్తంభాల గరువు రామాలయం వద్ద ముగిసింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామిని శర్మ, వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల నిధులు ఇస్తోందని తెలిపారు. జిల్లాలో ఎయిమ్స్ వంటి అత్యాధునిక వైద్య సదుపాయాలు ఆసుపత్రి, పల్నాడు జిల్లాలో కేంద్ర విద్యాలయాలు, మెడికల్ కళాశాల నిర్మాణం కోసం కేంద్ర నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మోదీ అందరికీ సంక్షేమ పథకాలు అందేలా చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు కేంద్రం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి కరపత్రాలు అందజేసి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, ఈదర శ్రీనివాసరెడ్డి, శనక్కాయల అరుణ, మాగంటి సుధాకర్ యాదవ్, పాలపాటి రవి కుమార్, తులసి యోగేష్, వెంకటేష్ యాదవ్, బోలగాని సాంబయ్య, దర్శి నరసింహారావు, పెండ్యాల సాంబమూర్తి, ముత్యం నరేంద్ర, మహిళామోర్చా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

నేటి నుంచి 'జగన్నామ సంక్షేమ సంగమం' శిబిరాలు

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- పాత పోలీస్ స్టేషన్ పక్కన, చేబ్రోలు – ముట్లూరు రోడ్డు జంక్షన్ వద్ద ఏర్పాటు
- సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు పిలుపు



చేబ్రోలు: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో బజరంగ్ ఫౌండేషన్ సామాజిక సేవా పరంపరను కొనసాగిస్తున్నామని, దీనిలో భాగంగా మండల కేంద్రమైన చేబ్రోలులో రెండు రోజుల పాటు జగన్నామ సంక్షేమ సంగమం శిబిరాలను నిర్వహిస్తున్న ట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయాలకు అతీతంగా పలు గ్రామాలలో నిర్వహించిన సంక్షేమ సంగమ శిబిరాలకు అనూహ్య రీతిలో స్పందన లభించిందని వివరించారు. ఇదే క్రమంలో చేబ్రోలులో గురువారం పాత పోలీస్ స్టేషన్ పక్కన, శుక్రవారం చేబ్రోలు – ముట్లూరు రోడ్డు జంక్షన్‌లో రెండు రోజుల పాటు బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బజరంగ్ 'జగన్నామ సంక్షేమ సంగమం' శిబిరాలను నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. బజరంగ్ – నేత్ర జ్యోతి, బజరంగ్ – మీ గుండె పదిలం, బజరంగ్ – దివ్యాంగదర్శిని, ఫిజియోథెరపీ సేవలను శిబిరాల లో ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. నేత్రజ్యోతి శిబిరంలో కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి వారంరోజుల్లో ఉచిత కళ్లజోడు అందించడం, మీ గుండె పదిలం శిబిరంలో గుండె సంబంధిత సమస్యలు గుర్తించి అవసరమైన వారికి యాంజియోగ్రామ్‌లు, తదుపరి గుండె సర్జరీలు చేయించడం, స్టెంట్లు వేయించడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో అవసరమైన వారికి ఫిజియోథెరపీ సేవలు కూడా ఈ శిబిరంలో అందించనున్నట్లు తెలిపారు. గ్రామంలోని దివ్యాంగులకు ఉ చితంగా త్రిచక్ర వాహనం, జైపూర్ కాలు, వెస్టన్ కమో డు సమకూర్చనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు మద్దతుగా బజరంగ్ ఫౌండేషన్ కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన విస్తరిస్తూ ప్రజల సౌకర్యార్థం ఈ సేవలను ప్రజల ముంగిట్లోకి తీసుకువచ్చినట్లు వివరించారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంబటి మురళీకృష్ణ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

మునగాల(కోదాడ): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. గుంటూరుకు చెందిన కేవీఎస్ రాజు(18), కార్తీక్‌లు పని నిమిత్తం ఈనెల 23 న బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గం మధ్యలో సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందాపురం వద్ద జాతీయ రహదారిపై వీరి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న బాధితుల కుటుంబ సభ్యులు కోదాడ ఆస్పత్రికి చేరుకుని వారిని విజయవాడకు తరలించారు. అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కేవీఎస్ రాజు బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మునగాల పోలీసులు తెలిపారు.



